సాక్షి
వికారాబాద్

ఆదివారం : 19 : మార్చి : 2023



రోటీ.. ఆరోగ్యానికి మేటి
ఆరోగ్యంపై శ్రద్ధచూపేవారి సంఖ్య ఈ మధ్యకాలంలో పెరుగుతోంది. జొన్న, జైద రొట్టెపై ఆసక్తి చూపుతున్నారు. 8లో▸



నిరుద్యోగులతో చెలగాటం
టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. 8లో▸



అలంకార ప్రాయం..
పల్లె ప్రగతిలో భాగంగా ఉపాధి హామీ నిధులతో పలు గ్రామాల్లో నిర్మించిన వైకుంఠధామాలు అలంకారప్రాయంగా మారాయి. 9లో▸

న్యూస్‌రీల్

రేపు లబ్ధిదారుల ఎంపిక

పూడూరు: మైనార్టీ కార్పొరేషన్ కింద రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను సోమవారం లాటరీ విధానం ద్వారా ఎంపిక చేస్తామని ఎంపీడీఓ ఉమారాణి తెలిపారు. దరఖాస్తుదారులు ఉదయం 11 గంటలకు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయానికి రావాలని సూచించారు.

'సెర్ప్' సంబురాలు



వికారాబాద్‌లో సంబురాలు చేసుకుంటున్న సెర్ప్ ఉద్యోగులు

అనంతగిరి: పే స్కేల్ మంజూరు ఉత్తర్వులు జారీ చేసిన సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామని సెర్ప్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర సలహాదారు నర్సింలు అన్నారు. ఈమేరకు శనివారం వికారాబాద్‌లోని సెర్ప్ కార్యాలయంలో సంబరాలు చేసుకున్నారు. కేకులు కట్ చేసి, స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా పే స్కేల్ ఇప్పించడంలో కీలకపాత్ర పోషించిన మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, దయాకర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతగిరి: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలన్నారు. మెనూ చార్జీలు, ప్రమాద బీమా చెల్లించాలని కోరారు. ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించడంతో పాటు గ్యాస్ సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, నర్సమ్మ, పద్మమ్మ, లక్ష్మి, సిద్ధమ్మ, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

'సేవా రత్న'లకు సన్మానం



సన్మాన కార్యక్రమంలో అతిథులు, అవార్డు గ్రహీతలు

పూడూరు: మహనీయుల అడుగుజాడల్లో నడుస్తూ.. ప్రతి ఒక్కరు సేవాభావాలను కలిగి ఉండాలని హైకోర్టు న్యాయవాది కడుమూరు ఆనందం అన్నారు. ఇటీవల సేవా రత్న అవార్డులు పొందిన రాకంచర్ల మాజీ సర్పంచ్ పెంటయ్య, మన్నెగూడ ఆదిల్, లక్నాపూర్ శ్రీనివాస్, ఎరాన్‌పల్లి శ్రీనివాస్, మహమ్మద్ రఫీ, మంచన్‌పల్లి శ్రీనివాస్, జిల్లా సర్వేయర్ల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన పూడూరు సర్వేయర్ సుధాకర్‌ను శనివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నలుగురికి సేవ చేయడంలో ఉన్న ఆనందం మరెక్కడా దొరకదన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి హరిశ్చందర్, డాక్టర్ రమేశ్, దేవనోనిగూడ వెంకటయ్య, అల్తాఫ్, యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



యాలాల: మండల కేంద్రంలో కురుస్తున్న వడగళ్ల వాన



బంట్వారం: రాంపూర్‌లో ఎగిరి పడిన రేకులు



బంట్వారం: రోడ్డుపై విరిగిపడిన విద్యుత్ స్తంభం



అనంతగిరి: మదన్‌పల్లిలో నేలకొరిగిన మామిడి చెట్లు

రైతును ముంచిన రాళ్ల వాన

జిల్లాలోని పలు చోట్ల శనివారం కురిసిన వడగళ్ల వాన రైతులకు తీరని నష్టం కలిగించింది. వికారాబాద్, ధారూరు, మర్పల్లి, మోమిన్‌పేట, బంట్వారం, తాండూరు, యాలాల, కుల్కచర్ల మండలాల్లో సాగు చేసిన కూరగాయ, మామిడి పంటలు ధ్వంసమయ్యాయి. ఈదురు గాలుల ప్రభావంతో విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. పలు రేకుల ఇళ్ల పైకప్పులు ఎగిరిపోయాయి. పలుచోట్ల పశువులు మృతిచెందాయి.



అనంతగిరి: కామరెడ్డిగూడలో మొక్కజొన్న పంటలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ఆత్మీయ'మేదీ?

నేతల మధ్య నెలకొన్న విభేదాలు అధికార పార్టీకి సంకటంగా మారాయి. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అన్నిచోట్లా బీఆర్‌ఎస్ రెండు గ్రూపులుగా విడిపోయింది. దీంతో పలు చోట్ల నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనాలు రసాభాసగా మారాయి. ప్రస్తుత సమయంలో వీటి నిర్వహణ ఎమ్మెల్యేలకు కత్తిమీద సాములా పరిణమించింది.



బీఆర్‌ఎస్ సమ్మేళనాలపై దృష్టిసారించని ఎమ్మెల్యేలు
- డిసెంబర్‌లోపే పూర్తిచేయాలని అధిష్టానం ఆదేశం
- జిల్లాలోని సగం క్లస్టర్లలో ఇప్పటికీ ఊసేలేని కార్యక్రమాలు
- అడ్డంకిగా మారిన గ్రూపు తగాదాలు
- వ్యక్తిగత ముద్రకోసమే నేతల వెంపర్లాట

వికారాబాద్: క్లస్టర్ల వారీగా అధికార పార్టీ నిర్వహిస్తున్న సమ్మేళనాల్లో ఆత్మీయత కొరవడుతోంది. పార్టీ సంస్థాగత నిర్మాణ విషయంలో ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి లేకుండాపోతోంది. అధిష్టానం ఆదేశించి ఐదు నెలలవుతున్నా సమ్మేళనాలు పూర్తి కావటం లేదు. మునుగోడు ఎన్నికల సమయంలో నిర్వహించిన ఈ కార్యక్రమాలు మంచి ఫలితాలనిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని పార్టీ పెద్దలు నిర్ణయించారు. ఇది క్షేత్రస్థాయిలో కేడర్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని భావించారు. డిసెంబర్ మొదటి వారంలోపు రాష్ట్ర వ్యాప్తంగా సమ్మేళనాలు పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, పార్టీ ఇన్‌చార్జ్‌లకు ఆదేశాలు అందాయి. వందమంది ఓటర్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జ్‌లను నియమించాలని కూడా సూచించారు. కానీ ఇప్పటికీ సగం క్లస్టర్లలో ఆత్మీయ సమ్మేళనాలు పూర్తి కాలేదు. ఈవిషయంలో పరిగి నియోజకవర్గం కొంత మెరుగ్గా ఉండగా.. తాండూరు, కొడంగల్‌లో ఇప్పటివరకు సమ్మేళనాలు ప్రారంభం కాలేదు.

అసమ్మతి నేతలు దూరం

జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యేలే ఉన్నారు. పరిగిలో సమ్మేళనాలు పూర్తయ్యాయి. తాండూరు, కొడంగల్, చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని నవాబుపేటలోనూ పార్టీ అధిష్టానం ఇచ్చిన గడువు ముగిసినప్పటికీ ఎవరూ ఆత్మీయ సమ్మేళనాల ఊసెత్తడంలేదు. ఇప్పటి వరకు వికారాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమాలకు అసమ్మతి నేతలు హాజరుకాలేదు. మంత్రి హాజరైన సమ్మేళనాలకు సైతం ఎమ్మెల్యే అసమ్మతి వర్గం దుమ్మా కొట్టడం చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో పార్టీ నేతల్లో సమన్వయం కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పరిగిలోని పలుచోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి సోదరుడు అనిల్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి కార్యకర్తల ఎదుటే ఒకరినొకరు విమర్శించుకోవటం హాట్ టాపిక్‌గా మారింది.

గ్రూపు తగాదాలు

అధికార పార్టీలో ప్రముఖులు, మంత్రులు ఏదైనా సమావేశం ఏర్పాటు చేయాలంటే ఇంకే పరిస్థితి ఏర్పడింది. నిర్వహించే కార్యక్రమం, సమావేశం ఏదైనా ఆ విషయం పక్కన పెట్టి తమతమ గ్రూపుల బలాలు చూపించుకునేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇప్పటికే మంత్రులు హరీశ్‌రావు, సబితారెడ్డి సమక్షంలోనే గొడవలు జరిగిన సందర్భాలున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించాల్సి వస్తే పార్టీ శ్రేణుల మధ్య గొడవలు తప్ప ఏమీ ఉండదనే వాదనలు సైతం వినిపిస్తున్నాయి.

ఎవరి ఎజెండా వారిదే

జిల్లాలోని ఏ నియోజకవర్గంలో చూసినా పార్టీ పరిస్థితి ఎవరికి వారే.. యమునా తీరే అనే చందంగా మారింది. పార్టీ ఇచ్చిన కార్యక్రమాన్ని పక్కన పెట్టి ఎమ్మెల్యేలు తమ సొంత ఎజెండాతో ముందుకు సాగుతున్నారు. పల్లెపల్లెకు పైలెట్, మీతో నేను, పల్లెనిద్ర తదితర కార్యక్రమాలతో నియోజకవర్గాలు, కేడర్‌లో తమదైన ముద్ర వేసేందుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు ఆసక్తి చూపుతున్న ఎమ్మెల్యేలు పరోక్షంగా గ్రూపులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ కార్యక్రమాలను పెద్దగా పట్టించుకోకుండా వ్యక్తిగత ముద్ర కోసమే వెంపర్లాడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌లో పరిస్థితి మన పార్టీయా.. కాదా..? అనే నినాదం కాకుండా.. మనోడా.. కాదా..? మన గ్రూపా.. వైరి వర్గమా..? అనే మాటలు వినిపిస్తున్నాయి. లబ్ధిదారులు, ప్రజలకు అందించాల్సిన సంక్షేమ పథకాల అమలులోనూ ఇదే పంథాను అనుసరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. ఇది పార్టీలో తగాదాలను పెంచి, అసలుకే ఎసరు తెస్తోందనే వారూ కూడా లేకపోలేదు.

నీటి సమస్య.. మాటే వినిపించొద్దు

కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మ, డీఆర్‌ఓ అశోక్‌కుమార్‌తో కలిసి శనివారం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవిలో మార్చి నుంచి జూన్ వరకు తాగునీటి సమస్యలు ఎక్కువగా ఉంటాయని, మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో బాగా పని చేసి, ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తాగునీటి సమస్య పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లా ద్వారా తాగునీరు సరఫరా చేస్తోందని వివరించారు. మున్సిపాలిటీలు, గ్రామాల్లో నీటి సమస్య అనే మాటే వినిపించకూడదన్నారు. నీరు కలుషితం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. లీకేజీలు ఉంటే వెంటనే సరిచేసుకోవాలని ఆదేశించారు. ఎంపీడీఓలు, ఎంపీఓలు, భగీరథ ఇంజనీర్లు ఎప్పటికప్పుడు సిబ్బందిని సమన్వయం చేసుకోవాలన్నారు. నీటి సరఫరాపై వచ్చే శుక్రవారం సంబంధిత శాఖలతో సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు. తాగునీరు, విద్యుత్ సమస్యలతో పాటు పల్లె ప్రగతిలో పది అంశాలపై వచ్చేవారం నుంచి క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని స్పష్టంచేశారు.

త్వరలో 'పాలమూరు' పూర్తి

జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ రమణ



మాట్లాడుతున్న, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, చిత్రంలో ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను త్వరలో పూర్తి చేసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామన్నాని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా ఇన్‌చార్జి ఎల్.రమణ పేర్కొన్నారు. మండల పరిధిలోని బొబ్బిలిగామలో శనివారం పది పంచాయతీల ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు తరహాలో పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతలను పూర్తి చేసి రైతులకు సాగు నీరు పుష్కలంగా అందజేస్తామన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో బీఆర్‌ఎస్ పార్టీ మూడోసారి అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలాన్ని జిల్లాలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ గూడూరు నర్సింగ్‌రావు, మాజీ చైర్మన్లు వెంకటయ్య, నక్క శ్రీనివాస్‌గౌడ్, నర్సింహారెడ్డి, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్, మండల కో–ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, పార్టీ సీనియర్ నాయకులు జడల రాజేందర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, పాండు, సుధాకర్‌రెడ్డి, సర్పంచ్‌లు అర్చన, కేతన జయమ్మ, చంద్రశేఖర్, నర్సింహారెడ్డి, దర్శన్, నాయకులు దేవేందర్‌రెడ్డి, షబ్బీర్, ప్రభాకర్, రంగారెడ్డి, ప్రకాంత్, ఈదుల కృష్ణగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారు

వైభవంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు

- భక్తిశ్రద్ధలతో వేడుకలకు అంకురార్పణ
- ఘనంగా స్వామివారి ఊరేగింపు



సేనాధిపతి ఉత్సవంపై స్వామివారి ఊరేగింపు

కొడంగల్ రూరల్: పేదల తిరుపతిగా పేరుగాంచిన శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వరస్వామి 43వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. వేడుకలకు ప్రారంభ సూచకంగా శనివారం రాత్రి భక్తిశ్రద్ధలతో అంకురార్పణ నిర్వహించారు. పద్మావతీ సమేత స్వామివారు ఆలయం నుంచి సేనాధిపతి ఉత్సవంపై పట్టణంలోని ప్రధాన రహదారి మీదుగా బస్టాండ్ సమీపంలోని మండపానికి చేరుకున్నారు. మండపానికి ఆనుకుని ఉన్న పుట్ట వద్ద శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన పురోహితులు పుట్ట మన్ను సేకరించారు. అనంతరం మహిళలు శ్రీవారికి మంగళ హారతులతో నీరాజనం పలికారు. స్వామివారి వాహన సేవ ఊరేగింపుగా ఆలయానికి చేరుకోగా యాగశాలకు పుట్టమన్ను తీసుకెళ్లారు. ఆదివారం ఉదయం ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, రాత్రి 9నుంచి 11గంటల వరకు పెద్ద శేష వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు పాడి ఆవు మృతి



మృతి చెందిన పాడి ఆవు

పరిగి: పిడుగుపాటుకు పాడి ఆవు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని సయ్యద్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు గోపాల్‌రెడ్డి పాడి ఆవుపై ఆధారపడి జీవిస్తున్నాడు. శుక్రవారం రాత్రి పొలం దగ్గర కట్టేసి ఇంటికి రాగా రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఈ క్రమంలో పిడుగుపాటుకు గురై ఆవు మృతి చెందింది. దీంతో రైతులకు రూ.80వేల ఆర్థిక నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బీడీ టీం ముమ్మర తనిఖీలు



పరిగి బస్టాండ్‌లో సోదాలు చేస్తున్న బీడీ టీం సభ్యులు

పరిగి: పట్టణ కేంద్రంలో బాంబ్ డిస్పోజల్ (బీడీ) టీం ముమ్మరంగా తనిఖీలు చేపట్టింది. శనివారం స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో, మార్కెట్ యార్డు తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించింది. బస్టాండ్‌లో ప్రయాణికుల బ్యాగులను చెక్ చేసి పలు సూచనలు అందించారు. అనుమానితులు ఏమైనా వస్తువులు ఇస్తే తీసుకోకూడదని సూచించారు. బస్టాండ్‌లో, ప్రజలు గుమిగూడే ప్రదేశాల్లో ఏదైనా వస్తువు పెట్టి వెళ్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో బీడీ టీం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

అనంతగిరి: వడగళ్ల వానతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కాంగ్రెస్ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు రత్నారెడ్డి, వికారాబాద్ ఎంపీపీ చంద్రకళ డిమాండ్ చేశారు. శనివారం కాంగ్రెస్ నాయకులు వికారాబాద్ మండలం కామరెడ్డిగూడ గ్రామంలో నష్టపోయిన పంటపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో నష్టాన్ని అంచనా వేయాలన్నారు. చేతికి వచ్చిన పంటలు నేలపాలయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కమాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అకాల వర్షాలతో ఉల్లి రైతు బెంబేలు

- వడగళ్ల వానతో తీరని నష్టం
- మండలంలో వెయ్యి ఎకరాలకుపైగా పంట నష్టం
- పెట్టుబడులు రాని దుస్థితి



ఎన్కేపల్లిలో వడగళ్ల వర్షానికి దెబ్బతిన్న ఉల్లి పంట

మోమిన్‌పేట: అకాల వర్షాల వల్ల ఉల్లి రైతులు బెంబేలెత్తుతున్నారు. వడగళ్లతో కూడిన వర్షం కురవడంతో ఉల్లి పంట పూర్తిగా దెబ్బతిన్నది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు ఉల్లిని కోలుకోలేని స్థితికి నెట్టేసింది. గురువారం మధ్యాహ్నం వడగళ్ల వర్షం కురవడంతో ఉల్లి ఆకు పూర్తిగా నేలవాలింది. శుక్రవారం రాత్రి మళ్లీ కురిసింది. అనేక ఇబ్బందులు పడుతూ, పగలు రాత్రి కష్టపడి నీరందించిన ఉల్లి పంట అకాల వర్షాలతో చేతికి రాకుండా పోయింది. డిసెంబరులో నాటు వేసిన ఉల్లి పంట కోత దశకు చేరుకొంది. ఉల్లి గడ్డ ఊరే దశలో ఉండటంతో ఆకులన్నీ విరిగి నేలవాలడంతో పంట అక్కడితో ఆగిపోతుందని రైతులు పేర్కొంటున్నారు. అప్పు చేసి పెట్టుబడి పెడితే వడగళ్ల వర్షం వల్ల తీరని నష్టం ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న ఉల్లి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు. మండలంలో మేకవనంపల్లి, కోల్కుంద, చిన్న కోల్కుంద, అంరాధికుర్దు, అంరాధికలాన్, రాళ్లగుడుపల్లి, ఏన్కతల, కాసులాబాదు, బూర్గుపల్లి, మోమిన్‌పేట, దేవరంపల్లి, వెల్‌చాల్, ఎన్కేపల్లి, సయ్యద్‌అల్లీపూర్ తదితర గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాలలో ఉల్లిని సాగు చేస్తున్నారు.

ఆ గ్రామాల్లో అధికం..

ఉల్లి ఊరే దశలో, కోతకు వచ్చే దశలో వర్షాలు కురిస్తే నిలువ ఉండదు. అలాంటిది వడగళ్ల వర్షం కురిస్తే ఉల్లికి పూర్తిగా నష్టమే. ఏన్కతల, మేకవనంపల్లి, కోల్కుంద, కాసులాబాద్ గ్రామాలలో ఎక్కువగా రైతులు ఉల్లిని నిలువ ఉంచుతారు. పై గ్రామాల్లో అధిక మొత్తంలో ఉల్లి పంటను సాగు చేస్తారు. దిగుబడులు తక్కువ వచ్చినా మార్కెటులో ధర తక్కువ ఉన్నా అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఎకరాకు రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకొంటే తప్ప అప్పుల ఊబిలోంచి బయటపడమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోతకు వచ్చే దశలో వర్షం



మార్కెట్‌లో ఉల్లికి ధర పలకడంతో రూ.60వేల పెట్టుబడి పెట్టి రెండు ఎకరాలలో పంటను సాగు చేశా. పంట బాగానే ఎదిగింది. ఇంకా పది రోజుల్లో కోతకు వచ్చేది. కురిసిన వడగండ్ల వర్షానికి పూర్తిగా పంట దెబ్బతింది. పెట్టుబడులు కూడా వచ్చేది కష్టమే. దీంతో పాటు రెండు ఎకరాలలో టమాటా సాగు చేశా. అది కూడా పూర్తిగా దెబ్బతిన్నది.

– రైతు రాంచంద్రారెడ్డి, ఎన్కేపల్లి.

పంట నిలువ ఉండదు



కూలీల కొరతను అధిగమించి ఎన్నో ఇబ్బందుల కోర్చి ఉల్లిని సాగు చేశా.. తీరా చేతికొచ్చేవేళ ప్రకృతి కన్నెర్ర చేసింది. వర్షాలు కురిసినా, వడగళ్లు పడినా నిలువ పంట ఉండదు. ఉల్లిగడ్డ ఆకారమే మారుతుంది. పొరలు ఊడిపోయి మురుగుపడుతుంది. పంటనే నమ్ముకున్నా. అప్పులు తీర్చే మార్గం కన్పించడం లేదు. ప్రభుత్వం పరిహారం చెల్లించి ఆదుకోవాలి. – రైతు అంజిరెడ్డి, ఏన్కతల

క్రికెట్‌లో నేషనల్ మీట్‌కు ఎంపికైన విద్యార్థులు



విశాల్



సాయి వినయ్

బంట్వారం: స్టేట్ మీట్ ఆధ్వర్యంలో జరిగిన క్రికెట్ పోటీల్లో బంట్వారం మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. 9వ తరగతి విద్యార్థులు విశాల్, సాయి వినయ్ అండర్ 17–19 కేటగిరి విభాగాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి నేషనల్ మీట్‌కు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు ఢిల్లీలోని ఖాంజ్వాలా క్రికెట్ గ్రౌండ్‌లో ఈ నెల 27 నుంచి 29 వరకు నిర్వహించే పోటీల్లో ఆడనున్నారు. నేషనల్ మీట్‌కు ఎంపిక కావడంపై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సరళారెడ్డి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

ఇసుక ఫిల్టర్లు ధ్వంసం

తలకొండపల్లి: కృత్రిమ ఇసుక తయారు చేసేవారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తహసీల్దార్ కృష్ణ హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని జంగారెడ్డిపల్లిలో రెవెన్యూ అధికారులు పర్యటించారు. పక్కా సమాచారం మేరకు కృత్రిమ ఇసుక ఫిల్టర్లపై దాడులు నిర్వహించారు. మూడు కృత్రిమ ఇసుక ఫిల్టర్లను జేసీబీతో ధ్వంసం చేసి నేలమట్టం చేశారు.

అర్హులైన రైతులందరికీ రుణాలు

పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి

బంట్వారం: వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. శనివారం బంట్వారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన రైతులందరికీ స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు ఇస్తున్నామన్నారు. తీసుకున్న రుణాలను రైతులు సక్రమంగా చెల్లించాలన్నారు. రికవరీ 50 శాతం కంటే ఎక్కువగా ఉంటేనే నాబార్డు లాంటి సంస్థలు మరింత ఎక్కువగా అప్పు ఇస్తాయన్నారు. సంఘం అభివృద్ధికి రైతులందరూ సహకరించాలని ఆయన కోరారు. పంటల సీజన్‌లో రైతులకు ఎప్పటికప్పుడు ఎరువులు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఎరువుల గోడౌన్ నిర్మాణం చేపడతామన్నారు. ఇప్పటికే ప్రభుత్వ స్థల సేకరణ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. సొసైటీలో తక్కువ వడ్డీకే బంగారం తాకట్టు పై రుణ సదుపాయం ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సీఈఓ బ్రహ్మం జమ ఖర్చుల లెక్కలను సభలో చదివి వినిపించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు , సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఫిజికల్ డైరెక్టర్‌కు సన్మానం



ఫిజికల్ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం, నాయకులు

పరిగి: పట్టణ కేంద్రంలోని నంబర్ 1 ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న గాంగ్యానాయక్ బదిలీపై వెళ్లారు. దీంతో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, ప్రజా సంఘాల నాయకులు శనివారం పాఠశాలలో ఘనంగా సన్మానించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సర్వసాధారణమని, అంకితభావంతో విధులు నిర్వహిస్తే సమాజంలో తప్పక గుర్తింపు వస్తుందన్నారు. కార్యక్రమంలో మానవహక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, గోపాల్, కృష్ణ, మౌలానా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటం

- పేపర్ లీక్ చేసిన వారిని కఠినంగా శిక్షించాల్సిందే
- సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య
- పరిగిలో సీఎం దిష్టి బొమ్మ దహనం



పరిగిలో సీఎం దిష్టి బొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

పరిగి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి పాల్పడిన వారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీ ఘటనపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడాన్ని నిరసిస్తూ.. శనివారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదుట సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. టీఎస్‌పీఎస్సీ పేపర్లన్నీ లీక్‌లు కావడం ప్రభుత్వ అసమర్థతే కారణమన్నారు. ఈ నిర్లక్ష్యానికి ప్రభుత్వం బాధ్యత వహిస్తూ చైర్మన్, కార్యదర్శులను వెంటనే సస్పెండ్ చేయాలని కోరారు. నిరుపేద విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కీలకమైన పత్రాలకు భద్రత లేకుండా పోయిందంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు హబీబ్, సత్తయ్య, రఘురాం, మహిపాల్‌రెడ్డి, లక్ష్మి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రుణాల కోసం లబ్ధిదారుల ఎంపిక

మర్పల్లి: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం లబ్ధిదారులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేశారు. మండల పరిధిలో మైనార్టీ కార్పొరేషన్ రుణాల కోసం 354 మంది యువత దరఖాస్తు చేసుకున్నారు. అయితే మండలానికి 20 యూనిట్లు మాత్రమే మంజూరు అయ్యాయి. దీంతో శనివారం ఎంపీపీ బట్టు లలిత రమేష్, జెడ్పీటీసీ మధుకర్, ఆయా బ్యాంకుల అధికారుల సమక్షంలో ఎంపీడీఓ రాజ్ మల్లయ్య లాటరీ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపికైన లబ్ధిదారులు యూనిట్లు ఏర్పాటు చేసుకుని ఆర్థికంగా బలపడాలని అన్నారు. కార్యక్రమంలో ఆయా బ్యాంకుల మేనేజర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, దరఖాస్తుదారులు ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



దోర్నాల్‌పల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆయుర్వేదిక్ వైద్యాధికారి గాయత్రి

దోమ: ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్య పరమైన సమస్యలను దూరం చేసుకోవాలని ఆయుర్వేదిక్ వైద్యాధికారి గాయత్రి సూచించారు. శనివారం మండల పరిధిలోని దోర్నాల్‌పల్లిలో ఆయుర్వేదిక్ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాదయ్య సాగర్, ఫార్మసిస్టులు వెంకటేశ్వర్లు, వనజ, ఆశ వర్కర్ అనిత, పంచాయతీ కార్యదర్శి, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్ ఆకస్మిక పర్యటన



కామరెడ్డిగూడలో పల్లెప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ

అనంతగిరి: వికారాబాద్ మండలం కామరెడ్డిగూడలో శనివారం అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో నర్సరీ, పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాన్ని పరిశీలించారు. నర్సరీ బాగుందని ఇంకా మెరుగుపడాలని సూచించారు. వైకుంఠధామంలో ఉన్న ప్లాంటేషన్‌ను చూసి సర్పంచ్‌ను అభినందించారు. పల్లె ప్రకృతివనంలో మొక్కలను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్తయ్య, ఎంపీఓ నాగరాజు, పంచాయతీ కార్యదర్శి శిల్ప, ఏపీఓ శీను, ఈసీ సతీష్‌కుమార్, ఎఫ్ఏ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రోటీ.. ఆరోగ్యానికి మేటి

- జొన్న రొట్టెలపై పెరిగిన ఆసక్తి
- విరివిగా విక్రయాలు



పిండిగిర్నీని నడిపిస్తున్న శ్రీనివాస్



అమ్మడానికి రొట్టెలు చేస్తున్న మహిళ

వికారాబాద్ అర్బన్: ఆరోగ్యంపై శ్రద్ధచూపేవారి సంఖ్య ఈ మధ్యకాలంలో పెరుగుతోంది. జొన్న, జొన్న రొట్టె, చిరుధాన్యాలపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో జొన్న రొట్టెల విక్రయాలు మార్కెట్లో విరివిగా జరుగుతున్నాయి. సమాజంలో దీర్ఘకాలిక రోగాలు అధికం కావడంతో సంప్రదాయ ఆహారంపై అన్నీ వయసుల వారు దృష్టి సారించారు. డయాబెటిస్ వంటి రోగం నుంచి కొంత ఉపశమనం పొందేందుకు జొన్నరొట్టెలు, చిరు ధాన్యాల ఆహారం, రాగి అంబలి వంటివి ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

పిండి గిర్నీలకు గత వైభవం..

ఇరవై ఐదేళ్ల క్రితం పిండి గిర్నీలేని గ్రామం ఉండేది కాదు. చిన్నచిన్న పల్లెల్లో పిండి గిర్నీ లేకుంటే పక్క గ్రామాలకు వెళ్లి పిండి పట్టించుకునే వాళ్లు. అప్పట్లో ప్రభుత్వ చౌకధర దుకాణాల ద్వారా బియ్యం సరఫరా ఇంత పెద్ద మొత్తంలో ఉండేది కాదు. ప్రతి ఇంటిలో మూడు పూటలా జొన్నరొట్టె, లేక జొన్న రొట్టెలు, ఆకు కూరలు చేసేవాళ్లు. ఇలా ఒక్కో ఇంట్లో 15 నుంచి 20 రోజుల సరిపడే పిండిని పట్టించేవాళ్లు. పొలాల్లో పండించిన జొన్నలను, చిరు ధాన్యాలను అమ్మేవారు కాదు. ఏడాదంతా ఇంటికి సరిపడేలా దాచిపెట్టేవారు. ప్రభుత్వం చౌకధరల దుకాణాల ద్వారా బియ్యం సరఫరా కోట పెంచడంతో పాటు, మార్కెట్లో కూడా రకరకాల బియ్యం చౌకగా లభిస్తుండటం.. జీవనసరళి మారడంతో ప్రజలు జొన్న రొట్టెలకు బదులుగా అన్నం తినడానికి ఎక్కువగా అలవాటు పడ్డారు. దీంతో గ్రామాల్లోని అనేక పిండి గిర్నీలు మూత బడ్డాయి. అయితే గత ఐదారేళ్లుగా పిండి గిర్నీలకు గిరాకీ పుంజుకుందని, వాటికి పూర్వ వైభవం వచ్చిందని యజమానులు చెబుతున్నారు. జిల్లా కేంద్రంలోనే 53 పిండి గిర్నీలు ఉన్నాయంటే వాటి ప్రాధాన్యత ఎంత ఉందో అర్థం చేసుకోవచ్చు.

రెండు వేల వరకు రొట్టెల అమ్మకం..

జిల్లా కేంద్రం వికారాబాద్‌లో సుమారు 30 వరకు కర్రీ పాయింట్లు, మరో 20 వరకు హోటళ్లు ఉంటాయి. వీటన్నింటిలో జొన్నరొట్టెలను అందుబాటులో ఉంచుతున్నారు. ఇవి కాకుండా కేవలం సాయంత్రం సమయంలో జొన్న రొట్టెలు చేసి అమ్మేవాళ్లు ఉన్నారు. ఇలా రోజుకు జిల్లా కేంద్రంలో కర్రీ పాయింట్లలో, ప్రత్యేకంగా అమ్మేవారి నుంచి సుమారు రెండు వేల రొట్టెలు అమ్ముడు పోతాయని యజమానులు చెబుతున్నారు. కొన్ని చోట్ల సాయంత్రం 8 దాటితే రొట్టెలు దొరికే పరిస్థితి ఉండదు. ఈ మధ్యకాలంలో గృహప్రవేశాలు, ఇతర చిన్నచిన్న శుభకార్యాల్లో జొన్న, జొన్న రొట్టెను భోజనంలో వడ్డించడం సంప్రదాయంగా మారింది. అమెరికా, బ్రిటన్ వంటి పాశ్చాత్య దేశాల్లో ఉన్న తమ వారి కోసం కూడా ఇక్కడి నుంచి వారి కుటుంబీకులు జొన్న రొట్టెలను పార్సిల్ చేస్తుండటం గమనార్హం.

గిర్నీలకు పెరిగిన గిరాకీ

చాలా ఏళ్లుగా పిండి గిర్నీ నడుపుతున్నాను. గతంలో కంటే ఇప్పుడు గిరాకీ పెరిగింది. ఉదయం, సాయంత్రం వేళ నడిపిస్తాం. మంచి లాభాలు కూడా ఉన్నాయి. చాలా మంది జొన్నలతో పాటు, చిరు ధాన్యాలను కూడా పిండి పట్టించుకుంటున్నారు. జొన్న రొట్టె తినేవాళ్ల సంఖ్య పెరిగింది.

– శ్రీనివాస్, గిర్నీ యజమాని

రోజూ 300 రొట్టెలు అమ్ముతున్నా



గతంలో హోటల్ నడిపేవాళ్లం. కొంత కాలంగా హోటల్ మూసివేసి జొన్న రొట్టెలను అమ్ముతున్నాం. ఐదారేళ్లుగా రొట్టెలకు డిమాండ్ పెరిగింది. రోజుకు మూడు వందల రొట్టెలు అమ్ముతాం. అన్నీ వయస్సుల వాళ్లు రొట్టెలు తినేందుకు ఇష్ట పడుతున్నారు. శుభకార్యాలకు కూడా ఆర్డర్‌పై తీసుకెళ్తున్నారు.

– నారాయణ జొన్న రొట్టెల వ్యాపారి

రొట్టెనే తింటున్నా..



నా వయస్సు 70 ఏళ్లు నేను ఇప్పటికీ జొన్నరొట్టెనే తింటాను. చిన్నప్పటి నుంచి ఎక్కువగా జొన్నరొట్టెనే తింటున్నా. ఎలాంటి దీర్ఘకాలిక రోగాలు లేవు. 40 ఏళ్లుగా కుట్టు మిషన్ కుడుతున్నాను. ఈ వయస్సులో కూడా రోజుకు ఐదు గంటలు మిషన్ పని చేస్తాను. జొన్నరొట్టె తినడంతోనే ఆరోగ్యంగా ఉంటున్నా..

– అడివయ్య, వృద్ధుడు, వికారాబాద్

ఇంటి సమీపంలో పిడుగుపాటు

పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు



పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

ధారూరు: మోమిన్‌కలాన్ గ్రామంలో నస్కంటి గోపాల్ ఇంటి సమీపంలో శనివారం సాయంత్రం పిడుగు పడటంతో ఇల్లు పాక్షికంగా దెబ్బతిన్నది. ఇంట్లో పొగ వ్యాపించిందని, ఆ సమయంలో ఇంట్లో భయపడి పరుగుతీసినట్లు కుటుంబీకులు తెలిపారు. పిడుగు పడిన వెంటనే ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసిందని గ్రామస్థులు తెలిపారు. కాగా గోపాల్ ఇంటిపైన పిడుగు పడిందన్న పుకార్లతో గ్రామస్తులంతా ఆ ఇంటికి పరుగు తీశారు.

సెర్ప్ ఉద్యోగుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న సెర్ప్ ఉద్యోగులు

పరిగి: రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులకు క్యాడర్ ఇచ్చి పే స్కేల్ కూడా ఇస్తామని శనివారం జీఓ విడుదల చేయడంతో మండల సమాఖ్య కార్యాలయంలో ఉద్యోగులు సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు చేసుకున్నారు. సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం క్యాడర్ ఇచ్చి పేస్కేల్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సెర్ప్ ఉద్యోగులు సీఎం కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటామన్నారు. ఉద్యోగ భద్రత లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్న తమకి ప్రభుత్వం అండగా నిలబడం గర్వించదగ్గ విషయమన్నారు.

అభినందనీయం

మర్పల్లి: సెర్ప్ ఉద్యోగస్తులకు పేస్కేల్ కల్పిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేయడం అభినందనీయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా సెర్ప్ ఉద్యోగుల సంఘం మాజీ చైర్మన్ మధుకర్ అన్నారు. సెర్ప్ ఉద్యోగస్తుల కుటుంబాల్లో వెలుగులు నిండనున్నాయని ఆయన కొనియాడారు.